క్లుప్తంగా

కాపు ఉద్యమ నేత వెంకటేశ్వరరావుకు ఘన నివాళి



వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్‌: కాపునాడు వ్యవస్థాపకుడు, ఉద్యమ నేత దివంగత పిల్లా వెంకటేశ్వరరావు 4వ వర్ధంతిని స్థానిక మహిపాల వీధిలో సోమవారం నిర్వహించారు. కాపునాడు సంయుక్త కార్యదర్శి అబ్బిరెడ్డి శ్రీరామమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ వర్ధంతి కార్యక్రమంలో తొలుత వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాలుగేళ్ల క్రితం కరోనా బారిన పడి వెంకటేశ్వరరావు అకాల మృతి చెందడం కాపు జాతికి తీరని లోటని శ్రీరామమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు గారపాటి బాలాజీ, అబ్బిరెడ్డి రమేష్‌, వింటి దిలీప్‌ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు రమణయ్య చిరస్మరణీయుడు



రమణయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: ఫ్రెంచి వారి నుంచి యానాంను విముక్తి చేసేందుకు పోరాడిన స్వాతంత్య్ర సమరయోధుడు దడాల రమణయ్య (రఫేల్‌) వర్ధంతిని సోమవారం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం ఎదురుగా ఉన్న రమణయ్య కాంస్య విగ్రహానికి ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్రెంచి వారి నుంచి యానాంకు స్వాతంత్య్రం తీసుకురావడంలో ఫ్రెంచి సైనికుల తుపాకులకు ఎదురొడ్డి నిలిచి పోరాడిన రమణయ్య చిరస్మరణీయులన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ అడలరసన్‌, ఎస్సై పునీత్‌రాజ్‌, ట్రాఫిక్‌ ఎస్సై నూకరాజు పాల్గొన్నారు.

బాక్సర్‌ మణికంఠకు సన్మానం



బాక్సర్‌ మణికంఠను సత్కరిస్తున్న గ్రాంటు గ్రామస్తులు

తాళ్లరేవు: ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన అండర్‌–19 బాక్సింగ్‌ పోటీల్లో పాల్గొని రెండు రౌండ్లు గెలుపు సాధించి స్వగ్రామానికి తిరిగివచ్చిన బాక్సర్‌ పిల్లి మణికంఠ ప్రవీణ్‌ను సోమవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామానికి చెందిన మణికంఠ ఆంధ్రప్రదేశ్‌ తరపున క్రీడాపోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఎంపీపీ స్కూల్‌ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్‌ పంపన రామకృష్ణ, నాయకులు కుడుపూడి శివన్నారాయణ, ధూళిపూడి వెంకటరమణ, స్కూల్‌ హెచ్‌ఎం కాశి రవీంద్ర గ్రామస్తులు దుశ్శాలువా, పూలమాలలతో మణికంఠను సత్కరించారు.

బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడికి సత్కారం



నాగేశ్వరరావును సత్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

ఉప్పలగుప్తం: సీనియర్‌ న్యాయవాది, దళిత ఉద్యమకారుడు వడ్డీ నాగేశ్వరరావు ముమ్మిడివరం జ్యూడీషియల్‌ కోర్ట్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఐ.పోలవరం మండల మాల మహానాడు నాయకులు సోమవారం ఆయనను ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల మాల మహానాడు అధ్యక్షుడు రేవుశ్రీను, మట్ట గగనవీరుడు, ములపర్తి శ్రీను, వడ్డి గౌతమ్‌, కాశి పరివాజకుమార్‌, పందు మురళి, టి.రాంబాబు ఉన్నారు.

జూనియర్‌ ఇంజనీరు పరీక్ష వాయిదా

యానాం: విద్యుత్‌ శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్‌ ఇంజనీర్‌ ఉద్యోగాల భర్తీకి ఈనెల 11న ఆది వారం నిర్వహించాల్సిన పోటీ పరీక్షను వాయిదా వేస్తున్నట్టు సూపరింటెండెంట్‌ ఇంజనీర్‌ రాజేష్‌ సన్యాల్‌ సోమవారం తెలిపారు. పరీక్షకు సంబంధించి కొత్త తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని అభ్యర్థులు గ్రహించాలని కోరారు.

వీధి కుక్కలకు వింత రోగం

- శునకాలకు విస్తరిస్తున్న చర్మవ్యాధులు
- వ్యాధికి గురైన కుక్కలు కరిస్తే రేబిస్‌ సోకే ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలంటున్న పశు వైద్యులు



చర్మ వ్యాధి సోకిన కుక్క



గ్రామాల్లో పేట్రేగిపోతున్న వీధి కుక్కలు

అల్లవరం: కొన్నాళ్లుగా వీధి కుక్కలకు కొత్త రోగం అంటుకుంది. వీధి శునకాలకు చర్మ వ్యాధులు సోకడంతో ప్రమాదం పొంచి ఉంది. వీధి కుక్కలకు వ్యాప్తి చెందుతున్న చర్మ వ్యాధులు వాటి పట్ల ప్రాణంతకంగా మారుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా వీధి కుక్కలు వివిధ రోగాలతో సంచరిస్తున్నాయి. వీటి సంఖ్య రోజు రోజుకీ పెరుగుతోంది. వీధి కుక్కల సంఖ్యను నియంత్రించి, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సి చర్యలను ప్రభుత్వం గాలికి వదిలేయడంతో పరిస్థితి చేయిదాటి పోతోంది.

వీధి కుక్కలకు ఏడాది కాలంగా చర్మ వ్యాధులు వ్యాపించాయి. ఫంగస్‌, వైరస్‌ల కారణంగా ఒంటిపై గజ్జి లాంటి దద్దుర్లు ఏర్పడి బొచ్చు ఊడిపోయి, చర్మం కందిపోతోంది. ఫంగస్‌, వైరస్‌ల ద్వారా కుక్కల బొచ్చు ఊడిపోవడం, చిన్న పుండ్లు కనిపిస్తున్నాయి.

ఈ చర్మ వ్యాధి ఒక దాని నుంచి మరోదానికి వ్యాప్తి చెందుతోంది. చర్మ సంబంధిత వ్యాధి సోకిన కుక్కలకు చర్మంపై వెంట్రుకలు పూర్తిగా ఊడిపోతూ, రక్తం, చీము పొక్కులతో అంద వికారంగా దర్శినమిస్తున్నాయి.

పశువులకు ప్రమాదం

ఫంగస్‌, వైరస్‌ వ్యాధి సోకిన కుక్కలు వీధుల్లో తిరిగితే పశు సంపదపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. చర్మ సంబంధిత వ్యాధి సోకిన కుక్క జంతువుల్ని కరిస్తే జంతువులు సొంగ కార్చడం, డొక్కలు లోపలకి నొక్కుకుని పోవడం, మేత సరిగా తీసుకోకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సకాలంలో వైద్యం అందకపోతే పశువులు, జీవులు చనిపోయే అవకాశం ఉంది. అంతేకాకుండా మనుషులను కరిస్తే రేబిస్‌ సోకే ప్రమాదం ఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్రమత్తత అవసరం

చర్మవ్యాధి సోకిన వీధి కుక్కల పట్ల మనుషులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. వీటి నుంచి జీవులను, పశువులను కాపాడుకోవాలని చెబుతున్నారు. గ్రామాల్లో నిత్యం పెరుగుపోతున్న వీధి కుక్కలను నియంత్రించడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారు. వీధి కుక్కల సంఖ్య పెరగకుండా వీటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాల్సి ఉంది. అయితే ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నియంత్రణలో చొరవ చూపాలని కోరుతున్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్త

చర్మ వ్యాధి సోకిన కుక్కలతో ప్రమాదం పొంచి ఉంది. వ్యాధికి గురైన కుక్కలు గ్రామాల్లో సంచరిస్తూ మనుషులు, పశువులపై దాడి చేస్తాయి. వ్యాధికి గురైన కుక్కలకు పశువులను దూరంగా ఉంచాలి. వీటి ద్వారా రేబిస్‌ ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. చర్మ వ్యాధి సోకిన కుక్కలు పశువులను, జీవులను కరిస్తే వెంటనే పశు వైద్యాధికారిని సంప్రదించి చికిత్స అందించాలి.

– ఎం.నారాయణరావు, పశు వైద్యాధికారి, అల్లవరం

అన్నదాతలను దగా చేసిన ప్రభుత్వం

- మద్దతు ధరకు ధాన్యం కొనాలి
- దళారీ వ్యవస్థను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది



భీమనపల్లిలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి తదితరులు

ఉప్పలగుప్తం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్న అన్నదాతలు పండించుకున్న ధాన్యం కొనుగోలు చేయకుండా వారిని పూర్తిగా దగా చేసిందని వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి వడ్డిచెరువు ప్రాంతంలో వర్షానికి తడిచిన వరి చేలను, ధాన్యం రాశులను సోమవారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి పర్యటించి పరిశీలించారు. పర్యటనకు వచ్చిన జగ్గిరెడ్డితో రైతులు సమస్యలను వివరించారు. ప్రభుత్వం ధాన్యానికి రూ.1,725 మద్దతు ధర ప్రకటించినప్పటికీ కొనుగోలు చేయకుండా తాత్సారం చేస్తోందని రైతులు అన్నారు. దళారీలు క్షేత్రస్థాయిలో రూ.1,000 నుంచి రూ.1,100 చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోయారు. ఈ పరిస్థితుల్లోనే ధాన్యాన్ని నిల్వ ఉంచడంతో వర్షానికి తడిచి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ వైఎస్‌ జగన్‌ ముఖ్యమంత్రిగా ఉండగా తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం బాగున్న ధాన్యాన్ని సైతం కొనడానికి తాత్సారం చేస్తోందన్నారు. రైతులకు మద్దతు ప్రకటించి దొడ్డిదారిన దళారీలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. వరి సాగు ప్రధాన ఆధారంగా పండిస్తున్న అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాలో సుమారుగా 6 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం పండితే కేవలం 90 వేల మెట్రిక్‌ టన్నుల ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం తీసుకుని మిగిలిన 5 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యాన్ని దళారీలు దోచుకోవడానికి అప్పగిస్తారా అని జగ్గిరెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబు రైతు సమస్యలను గాలికొదిలేశారన్నారు. రైతుల నానా అవస్థలు పడుతుంటే ప్రశ్నిస్తానని వచ్చిన పవన్‌కల్యాణ్‌ కనిపించకుండా పోయారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రూ.1,725 ధరకు ధాన్యాన్ని కొని రైతు నష్టపోకుండా ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు. ఈ నెల 7న అమలాపురంలో రైతుల తరుపున మద్దతు ధర లభించేలా వైఎస్సార్‌ సీపీ పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అమలాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్‌ పినిపే శ్రీకాంత్‌, పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్‌ గన్నవరపు శ్రీనువాసరావు, రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్‌ పిల్లి సూర్యప్రకాష్‌, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జున్నూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు పెయ్యల రాజ్‌కుమార్‌, కడిమి చిన్నవరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనువాస్‌, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, జిల్లా మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు షేక్‌ అబ్దుల్‌ ఖాదర్‌, అమలాపురం టౌన్‌ పార్టీ అధ్యక్షుడు సంసాని నాని, మున్సిపల్‌ చైర్మన్‌ రెడ్డి సత్యానాగేంద్రమణి, పార్టీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, గొల్లపల్లి డేవిడ్‌ రాజు, కుడుపూడి భరత్‌భూషణ్‌, కాశి బాల మునికుమారి, బీసీ సెల్‌ అధ్యక్షుడు యనమదల పల్లంరాజు, మోటూరి సత్యంకాపు, యాళ్ల చిన్నా, రాయపురెడ్డి నాగు, రైతులు యాళ్ల లక్ష్మీనారాయణ, కోళ్లపల్లి పట్టాభిరాముడు తదితరులు పాల్గొన్నారు.

చిట్టబ్బాయి సేవలు చిరస్మరణీయం



చిట్టబ్బాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌, నియోజకవర్గాల పార్టీ కో ఆర్డినేటర్లు డాక్టర్‌ శ్రీకాంత్‌, సూర్యప్రకాష్‌, శ్రీనివాసరావు తదితరులు

పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

అమలాపురం టౌన్‌: మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డితో, వైఎస్సార్‌ సీపీ ఆవిర్భావం నుంచి ఆయన తనయుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనూ నడిచి పార్టీ విధేయతతోనే చివరి వరకూ జీవించిన సీనియర్‌ నేత దివంగత కుడుపూడి చిట్టబ్బాయి సేవలు చిరస్మరణీయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. అమలాపురం సూర్యనగర్‌లోని చిట్టబ్బాయి స్వగృహానికి జగ్గిరెడ్డితో సహ జిల్లా పార్టీ ముఖ్య నాయకులు సోమవారం ఉదయం వెళ్లి చిట్టబ్బాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. చిట్టబ్బాయి భార్య అరుణ, ఆయన కుమారుడు భరత్‌ భూషణ్‌, కోడలు రాష్ట్ర దృశ్య కళల అకాడమి మాజీ చైర్‌పర్సన్‌ సత్య శైలజతో జగ్గిరెడ్డి, జిల్లా పార్టీ నాయకులు మాట్లాడారు. నాడు ఉమ్మడి జిల్లాలో చిట్టబ్బాయి పార్టీ కోసం శ్రమించిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గత నెల 29న జరిగిన చిట్టబ్బాయి 4వ వర్ధంతి సభకు అనివార్య కారణాల వల్ల రాలేకపోయిన జగ్గిరెడ్డి ఇప్పుడు వారి కుటుంబాన్ని మర్యాదపూర్వకంగా కలసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జెడ్పీ చైర్మన్‌ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌, రాజోలు, అమలాపురం, రామచంద్రపురం, పి.గన్నవరం నియోజకవర్గాల పార్టీ కో ఆర్డినేటర్లు గొల్లపల్లి సూర్యారావు (మాజీ మంత్రి), డాక్టర్‌ పినిపే శ్రీకాంత్‌, పిల్లి సూర్య ప్రకాష్‌, గన్నవరపు శ్రీనివాసరావు చిట్టబ్బాయి చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రెడ్డి సత్య నాగేంద్రమణి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు షేక్‌ అబ్దుల్‌ ఖాదర్‌, పార్టీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, సూదా గణపతి, కుడుపూడి శాంతి భూషణం, చింతా రవి కిరణ్‌, చిక్కాల రవిశంకర్‌ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివంగత చిట్టబ్బాయి ఇంటి వద్దకు చేరుకున్న జిల్లా పార్టీ నాయకులతో జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి జిల్లాలో పార్టీ పటిష్టత కోసం చర్చించారు. జిల్లాలోని నియోజక వర్గాల పార్టీ కో ఆర్డినేటర్లను సమన్వయం చేసుకుని పార్టీని ఎలా పటిష్ట పరిచాలో చర్చించారు. అనంతరం చిట్టబ్బాయి ఇంటి వద్ద నుంచి జగ్గిరెడ్డి, పార్టీ కో ఆర్డినేటర్లు, జిల్లా పార్టీ శ్రేణులతో ర్యాలీగా జిల్లా కలెక్టరేట్‌కు బయలు దేరారు. ధాన్యం కొనుగోళ్లు లేక అకాల వర్షాలతో అవస్థలు పడుతున్న జిల్లా రైతాంగానికి మద్దుతుగా కలెక్టరేట్‌ వద్ద ఆందోళనకు దిగారు.

హెల్త్‌ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్‌ వద్ద సీహెచ్‌వోలతో మాట్లాడుతున్న జగ్గిరెడ్డి, వైఎస్సార్‌ సీపీ నేతలు

అమలాపురం రూరల్‌: ఆయుష్మాన్‌ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్‌ ఆఫీసర్ల సమస్యలను పరిష్కారానికి వైఎస్సార్‌ సీపీ మద్దతుగా నిలుస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌ సీహెచ్‌వోలు చేస్తున్న ధర్నా శిబిరాన్ని చిర్ల జగ్గిరెడ్డి, జెడ్పీ చైర్మన్‌ వితపర్తి వేణుగోపాలరావు, కోఆర్డినేటర్లు గొల్లపల్లి సూర్యారావు, పినిపే శ్రీకాంత్‌, గన్నవరపు శ్రీనివాసరావు, పిల్లి సూర్యప్రకాష్‌రావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య శాఖ ఉద్యోగుల పట్ల కక్ష సాధింపు పాల్పడుతోందన్నారు. సీహెచ్‌వోలు 8 నెలలుగా జీతాలు కూడా ఇవ్వకుండా అన్యాయం చేస్తోందన్నారు. ఉద్యోగుల సమస్యలను వైఎస్సార్‌ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి వెళ్తామని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వ ఆరోగ్యశ్రీ సేవలను నిర్వీర్యం చేసిందని ప్రజలకు వైద్య సేవలో సక్రమంగా అందడం లేదన్నారు.

8వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

కమ్యూనిటీ హెల్త్‌ ఆఫీసర్ల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె 8వ రోజుకు చేరింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు యాదవ్‌కు సమస్యలు విన్నవించేందుకు వెళ్లిన ఉద్యోగుల పట్ల అనుచితంగా మాట్లాడటం భావ్యం కాదన్నారు. ఇప్పటికైనా మంత్రి, అధికారులు సంఘ నాయకులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. జిల్లా అధ్యక్షురాలు పి.మమత జ్యోతి, బి శివ, టీ.మనోహర్‌, జల్లి, వెంకటేష్‌, సుమంత్‌. రాజీవ్‌ , జిల్లా ఉపాధ్యక్షుడు టీ.రంగారావు, సాయి తేజ, శ్రీ రామ్‌, హిమజ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయ ఏవో సేవలు అభినందనీయం



ఎస్పీ కార్యాలయ ఏవో జగన్నాథరావును సత్కరిస్తున్న ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ప్రసాద్‌

అమలాపురం టౌన్‌: జిల్లా ఎస్పీ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్‌ విభాగంలో ఏవోగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న డి.జగన్నాథరావు సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏవో బదిలీ అయిన సందర్భంగా సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభకు ఎస్పీ కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నూతన జిల్లాలు ఏర్పాటైనప్పటి నుంచి కార్యాలయంలో ఏవోగా పనిచేసిన జగన్నాథరావు తన విధులను సక్రమంగా సమర్థవంతంగా నిర్వహించారని ఎస్పీ పేర్కొన్నారు. చివరిగా బదిలీపై వెళుతున్న ఏవో జగన్నాథరావును ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్‌, అమలాపురం డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్‌ తదితరులు ఘనంగా సత్కరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. జిల్లా ఆర్మ్‌డ్‌ డీఎస్పీ జీయుఎల్‌కేవీ సుబ్బరాజు, డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాసరావు, అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు, రూరల్‌ సీఐ డి.ప్రశాంత్‌కుమార్‌, క్రైమ్‌ సీఐ ఎం.గజేంద్రకుమార్‌, ఈగల్‌ టీమ్‌ సీఐ ఎ.మురళీకృష్ణ, రిజర్వ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎన్‌. బ్రహ్మానందం, ఎస్పీ కార్యాలయ ఎస్సైలు, సిబ్బంది పాల్గొని ఏవో జగన్నాథరావును సత్కరించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ఆర్డీవోకు వినతిపత్రం



ఆర్డీవో మాధవికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఏపీ పీటీడీ అమలాపురం డిపో యూనియన్‌ ప్రతినిధులు

అమలాపురం టౌన్‌: ఆర్టీసీ యాజమాన్యంలో ఏపీపీటీడీ సంస్థ (యూనియన్‌) ప్రతినిధులు ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఆర్డీవో కొత్త మాధవికి సోమవారం వినతిపత్రాన్ని అందించారు. అమలాపురం డిపో యూనియన్‌కు చెందిన ప్రతినిధులు ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఏపీపీటీడీ అమలాపురం ఆర్టీసీ డిపో యూనియన్‌ ఆధ్వర్యంలో కార్మిక నేతలు పాల్గొన్నారు.

అసైన్డ్‌ భూములను పరిరక్షించాలి

తాళ్లరేవు: పటవల గ్రామ పంచాయతీలోని అసైన్డ్‌ భూములను పరిరక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్‌ చేసారు. సోమవారం రీసర్వే డీటీ వీరబాబును కలిసి అన్యాక్రాంతమైన అసైన్డ్‌ భూముల వివరాలను వివరించారు. అన్యాక్రాంతమైన అసైన్డ్‌ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు కేటాయించాలని కోరారు. ఆ దిశగా అధికారుల చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతిమూల గ్రామంలో చాలా ఏళ్లగా భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. కేవీపీఎస్‌ జిల్లా అధ్యక్షుడు బి.సురేష్‌ ఉన్నారు.

సమయపాలన పాటించాలి

యానాం: కీలకమైన రెవెన్యూ శాఖలో కొంతమంది ఉద్యోగులు, సిబ్బంది తమ విధులకు ఆలస్యంగా వస్తున్నారని దీంతో దూరప్రాంతాల నుంచి వివిధ ధ్రువపత్రాల కోసం కార్యాలయాలకు వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు అర్థాని దినేష్‌ అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో 11.20 గంటలకు కూడా ఏ ఒక్క ఉద్యోగి విధులకు హాజరుకాలేదని ఆయన తెలిపారు. విద్యార్థులకు అడ్మిషన్ల సమయం కావడంతో తీరప్రాంత గ్రామాలు తదితర ప్రదేశాల నుంచి వివిధ ధ్రువపత్రాల కోసం ప్రజలు వస్తున్నారని ఆయన తెలిపారు. అధికారులు, కిందిస్థాయి సిబ్బంది పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

కలెక్టరేట్‌ వద్ద ఏఐటీయూసీ ధర్నా

అమలాపురం రూరల్‌: జాతీయ కార్మిక సంఘాలు, రైతు సంఘాల కమిటీ పిలుపు మేరకు డిమాండ్స్‌ డే సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌ వద్ద ధర్నా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు కార్మికులు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ కార్మికులకు రూ.35 వేలు వేతనాలు చెల్లించాలని, 8వ పీఆర్‌సీ అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. నాయకులు మోకా శ్రీను, బొలిశెట్టి శంకర్‌ పాల్గొన్నారు.

పలువురు ఐఏఎస్‌ల బదిలీ

యానాం: పుదుచ్చేరిలో కొంతకాలంగా పీసీఎస్‌ కేడర్‌లో విధులు నిర్వహించి ఇటీవలే ఐఏఎస్‌ హోదా పొందిన పలువురు అధికారులను వివిధ కేంద్ర పాలిత ప్రాంతాలకు బదిలీ చేస్తూ సోమవారం హోమ్‌శాఖ కార్యదర్శి రాకేష్‌కుమార్‌సింగ్‌ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వైఎల్‌ఎన్‌ రెడ్డిని మిజోరాంకు, మహ్మద్‌ మన్సూర్‌ను చండీఘర్‌కు, పి రుద్రగౌడను లడఖ్‌, ప్రియదర్శిని ని అరుణాచల్‌ ప్రదేశ్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

తాళ్లరేవు: ఇంజరం గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్‌ ముద్దన వెంకటశివరామ ప్రసాద్‌ తెలిపారు. సోమవారం పంచాయతీకి నూతనంగా సమకూర్చిన ట్రాక్టర్‌ను సర్పంచ్‌ శివరామ ప్రసాద్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ మాట్లాడుతూ ఇప్పటి వరకు తొట్టి రిక్షాల ద్వారా చెత్తను సేకరించి డంపింగ్‌ యార్డుకు చేర్చేవారమని, దానిని సులభతరం చేసేందుకు ట్రాక్టరు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి, నాయకులు వేగేశ్న భాస్కర రాజు, ఆకెళ్ల నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శివగంగ దుర్గ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

తాళ్లరేవు: స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసియున్న భూసమేత వేంకటేశ్వరస్వామివారి 34వ కల్యాణ మహోత్సవాలు ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. వేద పండితులు శ్రీమాన్‌ వాడపల్లి గోపాలాచార్యుల ఆధ్వర్యంలో వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు స్వామివారికి పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసారు. అనంతరం చందనం, కుంకుమలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. తొలిరోజైన 8వ తేదీ ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణ అనంతరం శ్రీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి పరిణయ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. 9న కొతాయి ఉత్సవం, 10న రథోత్సవం, 11న సదస్యము, 12న చక్రస్నానం , ఊంజల్‌ సేవ, 13న శ్రీ పుష్పయాగం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 18న అన్నప్రసాద వినియోగం కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ప్లాస్టిక్‌ వస్తువులు వినియోగిస్తే జరిమానాలు



అమలాపురంలో మున్సిపల్‌ శానిటేషన్‌ సెక్రటరీలకు జరిమానా చెల్లిస్తున్న దుకాణదారుడు

అమలాపురం టౌన్‌: మున్సిపాలిటీ వార్డుల సచివాలయాల శానిటేషన్‌ అండ్‌ ఇన్విరాల్‌మెంటల్‌ సెక్రటరీలు బండి వీరన్న, ఆకుల కుమార స్వామి బృందం పట్టణంలో చెత్తను కాలువలో వేస్తున్న, ప్లాస్టిక్‌ వస్తువుల వినియోగంతో ఉన్న దుకాణాలపై సోమవారం సాయంత్రం దాడులు చేశారు. చెత్తను కాలువలో పడేస్తున్న ఓ వ్యాపారికి రూ.2 వేలు జరిమానా విధించారు. కలశం సెంటరులో ప్లాస్టిక్‌ వస్తువుల వినియోగిస్తూ వ్యాపారం చేస్తున్న ఇద్దరు దుకాణదారులకు రూ.6 వేలు జరిమానా విధించారు. హోటళ్లు, బేకరీ, వైన్స్‌ దుకాణాలను తనిఖీ చేశారు. మరో చోట ప్లాస్టిక్‌ వస్తువులు వినియోగిస్తున్న మూడు చోట్ల దుకాణ యాజమానులకు రూ.8 వేలు జరిమానా విధించారు. ఈ దాడుల్లో మొత్తం 1,200 కేజీల పాలథీన్‌ కవర్లను సీజ్‌ చేశారు. ఓ బేకరీ యజమానికి రూ.5 వేలు, హోటల్‌ యాజమానికి రూ.2 వేలు, వైన్‌ షాపు యాజమానికి రూ.వెయ్యి చొప్పున జరిమానాలు విధించారు. దుకాణ యాజమానులు అక్కడికక్కడే జరిమానాలు చెల్లించి రసీదు పొందేలా శానిటేషన్‌ సెక్రటరీలు ఏర్పాట్లు చేశారు. ఈ దాడుల్లో శానిటేషన్‌ మేస్త్రీలు ఎం.రాజు, ఎం.నవీన్‌కుమార్‌, శానిటేషన్‌ వర్కర్‌ ఎం.రాంబాబు పాల్గొన్నారు.

ఏజీపీగా రజిత

రాజోలు: రాజోలు సీనియర్‌, జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టుల అసిస్టెంట్‌ గవర్నమెంట్‌ ప్లీడర్‌(ఏజీపీ)గా న్యాయవాదిగా గుబ్బల రజిత నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌ ఆర్‌.మహేష్‌కుమార్‌ నుంచి ఉత్తర్వులు వచ్చాయని రజిత తెలిపారు. 2004లో న్యాయవాద వృత్తి చేపట్టిన ఆమె 2014 నుంచి రాజోలు కోర్టులో లీగల్‌ ఎయిడ్‌ కౌన్సిలర్‌గా, లోక్‌ అదాలత్‌ మెంబర్‌గా, మీడియేటర్‌గా సేవలందించారు. ప్యానల్‌ న్యాయవాదిగా పలు గ్రామాల్లో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. మూడేళ్లపాటు ఏజీపీగా కొనసాగుతారు. ఏజీపీగా తన నియామకానికి కృషి చేసిన రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఏజీపీగా నియామకమైన రజితను రాజోలు బార్‌అసోసియేషన్‌ న్యాయవాదులు అభినందించారు.

నేడు మెగా జాబ్‌మేళా

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఏ1 సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా వికాస మేనేజర్‌ గోళ్ల రమేష్‌ తెలిపారు. మెగా జాబ్‌మేళాలో 37 కంపెనీలు 1547 ఖాళీలను భర్తీ చేసే విధంగా ప్రణాళిక రూపొందించామన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన 30 ఏళ్ల వయసున్న నిరుద్యోగులు జాబ్‌ మేళాలో పాల్గొనవచ్చన్నారు. నిరుద్యోగులు రెజ్యూమ్‌ సాఫ్ట్‌ కాపీతో పాటు అర్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌ కార్డ్‌, పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలన్నారు. డిగ్రీ కళాశాల ఆవరణలో ఇంటర్వ్యూల నిర్వహణ గదులు, రిజిస్ట్రేషన్‌ డెస్క్‌లు, కంపెనీ బూత్‌లు, వెయిటింగ్‌ ఏరియా వంటి సదుపాయాలు కల్పించామన్నారు. మెగా జాబ్‌మేళాను ఏ1 సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు సహకారంతో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామన్నారు.